క్లుప్తంగా

ఏయూలో రెక్టార్ ఆకస్మిక తనిఖీలు



పర్యావరణ శాస్త్ర విభాగాన్ని పరిశీలిస్తున్న ఏయూ రెక్టార్ ఆచార్య కిషోర్‌బాబు

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీలో పలు విభాగాలను రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. దీనిలోభాగంగా జంతుశాస్త్రం, పర్యావరణ శాస్త్రం, బయోకెమిస్ట్రీ, బోటనీ, ఇన్‌స్ట్రుమెంట్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాలను సందర్శించారు. ఆయా విభాగాలలో సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. విభాగాల్లో జరుగుతున్న బోధనా విధానాలను ప్రత్యక్షంగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని పేర్కొన్నారు. ఆరోగ్యకర వాతావరణంలో బోధనా జరగాలని సూచించారు. ర్యాగింగ్‌కు తావులేకుండా చూడాలన్నారు. దీనికి సంబంధించిన పలు మార్గదర్శకాలను వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

25న ది గాడ్ ఫాదర్ చిత్ర ప్రదర్శన

మద్దిలపాలెం: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వారాంతపు ఉచిత సినిమా ప్రదర్శలో భాగంగా ఈనెల 25వ తేదీన ఆస్కార్ అవార్డు పొందిన ది.గాడ్ ఫాదర్ ఆంగ్ల చిత్రాన్ని ప్రదర్శిస్తున్నామని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధి ఎస్.పి.రావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు విశాఖ పౌర గ్రంథాలయం హాలులో ప్రదర్శిస్తున్నామని పేర్కొన్నారు.

సిరిపురం సర్కిల్ విస్తరణ కుదింపు



ద్రోణం రాజు సర్కిల్

బీచ్‌రోడ్డు: సిరిపురంలో ద్రోణంరాజు సర్కిల్ విస్తరణ కుదిస్తున్నారు. ట్రాఫిక్ సమస్య పెరుగుతుండడంతో ఆ సర్కిల్ వద్ద వాహనాల రాకపోకలకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో సర్కిల్ విస్తరణ తగ్గించి రోడ్డు విస్తరణ పెంచనున్నారు. ఇందులో భాగంగా జీవీఎంసీ అధికారులు సర్కిల్‌లో కొంత భాగాన్ని తొలగించారు. ఇకపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పనున్నాయి.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించండి



మద్దిలపాలెం కూడలిలో హెల్మెట్ ధారణపై ప్రైవేట్ ఉద్యోగుల ప్రదర్శన

మద్దిలపాలెం: సురక్షితంగా గమ్యస్థానాలకు చేరేందుకు ప్రతి ఒక్క ద్విచక్ర వాహన చోదకుడు విధిగా హెల్మెట్ ధరించాలని కోరుతూ సీఎంఆర్ సెంట్రల్‌లోని మెక్‌డొనాల్డ్స్ ఉద్యోగులు మంగళవారం మద్దిలపాలెం కూడలిలో ప్రదర్శన నిర్వహించారు. హెల్మెట్ చూపిస్తూ ప్రతి ఒక్కరూ ధరించాలని కోరారు. అనంతరం హెల్మెట్ ధారణ వలన కలిగే లాభాలను సూచిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ విభాగం హెడ్‌కానిస్టేబుల్ శంకర్ పాల్గొన్నారు.

11వ వార్డులో అన్న సమారాధన

ఆరిలోవ: జీవీఎంసీ పదకొండో వార్డు పరిధి టి.ఐ.సి పాయింట్‌లో మంగళవారం మహా అన్నసమారాధన జరిగింది. ఇక్కడ దుర్గాదేవి నవరాత్రుల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్నసమారాధనను తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు భోజనాలు వడ్డించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్య‘మా’





తుప్పుపట్టిన నౌక భాగాలు

ఆరిలోవ: తీవ్ర వాయుగుండం ప్రభావానికి నాలుగేళ్ల క్రితం విశాఖ తీరానికి కొట్టుకొచ్చిన బంగ్లాదేశ్ సరకు రవాణ నౌక ఎంవీ మా తుప్పు పట్టిపోతోంది. తీవ్ర వాయుగుండం ప్రభావానికి 2020 అక్టోబర్ 12న తీరానికి కొట్టుకురాగా... వెనక్కి పంపేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా నౌకలోని ఇంధనాన్ని సైతం తోడించారు. నౌకను అక్కడి నుంచి సముద్రం లోపలికి తీసుకువెళ్లడానికి మరింత వ్యయం అవనుండడంతో సంబంధిత యజమాని తిరిగి తీసుకువెళ్లేందుకు ఆసక్తి చూపించలేదు. 2,959 టన్నుల బరువు కలిగిన ఈ నౌకను ఆకర్షణీయంగా తీర్చిదిద్ది సందర్శనాలయంగా మార్చాలన్నది ఏపీ టూరిజం కల. అయితే నాటి నుంచి నేటి వరకూ ఇది కార్యరూపం దాల్చలేదు. ఫ్లోటింగ్ రెస్టారెంట్ నిర్మిస్తామని గతంలో ప్రకటించారు. అయితే ఇప్పటికీ దానిపై ఓ స్పష్టత లేదు. ఇదిలావుండగా నాలుగేళ్లుగా సముద్రంలో ఉండడంతో పలు భాగాలు శిథిలావస్థకు చేరాయి. నౌక బయట, లోపల భాగాలన్నీ తుప్పు పట్టాయి. ఈ తుప్పు కారణంగా ఇక్కడ బీచ్‌కు వెళ్లేవారు ఫొటోలు తీసుకోవడానికి సైతం ఆసక్తి చూపడం లేదు. టూరిజం అధికారుల నిర్లక్ష్యం తోడవడంతో ‘ఎంవీ మా’ స్థితి కోల్పోతోంది.



తెన్నేటి పార్కులో తుప్పపట్టిన బంగ్లాదేశ్ నౌక

బాలికలకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



బాలికలతో మాట్లాడుతున్న సివిల్ జడ్జి వెంకట శేషమ్మ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న వెంకట శేషమ్మ

ఆరిలోవ: బాలికలకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎం.వెంకట శేషమ్మ తెలిపారు. విశాఖ వేలీ పాఠశాల సమీపంలో ప్రభుత్వ బాలికల గృహాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. ఇక్కడ గృహం గదులు, ఆవరణ, వంట గది, వసతి గదులు పరిశీలించారు. అనంతరం ఇక్కడ బాలికలతో మాట్లాడారు. బాలికల్లో పరిశుభ్రత అవసరమన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రతి బాలిక తప్పనిసరిగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.ఆర్ రాధ, వెల్ఫేర్ కమిటీ సభ్యులు టి.వియలక్ష్మి, ఎం.రజని, గృహం పర్యవేక్షణాధికారి ఎ.వి. సునీత, గృహం వైద్యురాలు శోభారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

పెదజాలరిపేట పాఠశాలలో..

ఎంవీపీకాలనీ: పెదజాలరిపేటలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను జిల్లా సివిల్ జడ్జి, లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ సందర్శించారు. మంగళవారం మధ్యాహ్నం పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో సమాశమయ్యారు. ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారు. భోజన సౌకర్యాలు, తరగతి గదులు ఎలా ఉన్నాయో తెలుసుకున్నారు. సమస్యలుంటే నేరుగా తనకు దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అలసత్వం వద్దు

వీఎంఆర్‌డీ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్



గాజువాకలో పర్యటిస్తున్న మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్

విశాఖ సిటీ: క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల పట్ల అలసత్వం వహించవద్దని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ సూచించారు. వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సాంకేతిక విభాగంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పనుల నాణ్యత విషయంలో రాజీ పడొద్దని, ఇటువంటి విషయాల్లో మార్పు రాకపోతే క్రమశిక్షణా చర్యలను తీసుకునేందుకు వెనుకాడనని హెచ్చరించారు. ఈ పర్యటనలో ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ప్రధాన ఇంజనీర్ భవానీ శంకర్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్లు వీఎస్‌ఎన్ రాజు, సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో పర్యటన

పెదగంట్యాడ ప్రాంతంలో క్రీడల కోసం జిమ్, ఆడిటోరియం ఏర్పాటు గల అవకాశాలను పరిశీలిస్తున్నామని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ పేర్కొన్నారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం విశాఖ ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి గాజువాక ప్రాంతంలో పలు అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం అమరావతి పార్క్, వీఎంఆర్‌డీఏ ఓపెన్ ఆడిటోరియం, ప్రతిపాదిత పెదగంట్యాడ స్టేడియం స్థలాన్ని, ఆదర్శ్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణాన్ని, దయాళ్ నగర్ వద్ద ఉన్న కొండ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓపెన్ ఆడిటోరియానికి అదనపు సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఆదర్శ్ పబ్లిక్ స్కూల్‌ను వీఎంఆర్‌డీఏ నూతనంగా నిర్మించిన భవనంలోకి సాధ్యమైనంత త్వరగా షిఫ్ట్ చేస్తామన్నారు. గాజువాక పరిసర ప్రాంతాలలో ఉన్న కొన్ని ముఖ్యమైన రహదారులను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

మత్స్యకారుల జీవన స్థితిగతులపై గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు

మద్దిలపాలెం: మత్స్యకారుల జీవన విధానాన్ని, వారి స్థితిగతులను ఎంతో అద్భుతంగా రచించి, వారి జీవనాన్ని వెలుగులోకి తీసుకువచ్చారని ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు అన్నారు. మత్స్యకార జాతి ప్రాశస్త్యం, విశిష్టత గురించి బాహ్య ప్రపంచానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో ఒక గ్రంథాన్ని మత్స్యకారులో విద్యవంతుడైన గ్రంథకర్త పిక్కి కోదండరావు రచించడం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం గ్రంథాన్ని ప్రిన్సిపాల్ ఏ.నరసింహారావు, తెలుగు శాఖ అధ్యక్షుడు జర్రా అప్పారావు, డాక్టర్.కే.జీ వేణుల చేతులు మీదుగా ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ కేజీ వేణు గ్రంథాన్ని సమీక్షిస్తూ పిక్కి కోదండరావు అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం పెద తీనార్ల శివారు గ్రామమైన దొండవాక అనే మత్స్యకార కుగ్రామంలో పుట్టి, మత్స్యకారులైన తల్లిదండ్రుల జీవనంలో ఒడిదుడులను చూస్తూ పెరిగారన్నారు. వారి జీవనాన్ని బాహ్య ప్రపంచానికి చూపించాలని తపనతో ఉన్నత విద్యలో రాణించారన్నారు.ఆ తపనతోనే ఏయూలో ఎంఏ తెలుగు, సంస్కృతం, తెలుగు పండిట్ కోర్సులో శిక్షణ, బీఈడీ పూర్తి చేశారన్నారు. అనంతరం తన గ్రంథాన్ని రచించడానికి పూనుకున్నారు. మత్స్యకార జీవనాన్ని గ్రంథంలో మన అందరి ముందుకు తీసుకురావడం గొప్ప విషయని వేణు పేర్కొన్నారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న ఎస్‌ఐ రూపావతి

ఎంవీపీకాలనీ: మహిళల భద్రత, మాదకద్రవ్యాల నిషేదంపై ఎంవీపీకాలనీలోని సమత కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎండాడ దిశ పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ యు.రూపావతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రస్తుతం మహిళలు, చిన్నారులపై సమాజంలో తీవ్రమైన నేరాలు జరుగుతున్నాయన్నారు. సోషల్ మీడియా వినియోగం విస్తరించడం, మాదకద్రవ్యాల చలామణి పెరిగిపోవడం దీనికి కారణంగా నిలుస్తున్నాయన్నారు. ఈ రెండింటికి దూరంగా ఉండటం ద్వారా నేరాలకు అరికట్టేందుకు అవకాశం ఉందన్నారు. సోషల్ మీడియాలో అసభ్యపదజాలంతో మహిళలను దూషించడం, వారి ప్రమేయం లేకుండా వారి చిత్రాలను మార్ఫింగ్ చేయడం వంటి నేరాలకు కఠినమైన శిక్షలు ఉన్నాయన్నారు. ఇలాంటి ఘటనలు ఎవరికి ఎదురైనా వెంటనే పోలీసులను ఆశ్రయించాలన్నారు. కార్యక్రమంలో పలువురు కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యార్థులు హాజరయ్యారు.

ద్వారకా ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించిన సీపీ



ద్వారకా ఏసీపీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న సీపీ డా.శంఖబ్రత బాగ్చి

సీతమ్మధార : నగర పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి మంగళవారం రాత్రి ద్వారకా ఏసీపీ కార్యాయలయాన్ని సందర్శించారు. సబ్ డివిజన్ అధికారులు, సిబ్బంది విధులపై ఆరా తీశారు. కేసుల రికార్డులను పరిశీలించి సమస్యలు తెలుసుకున్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌కి వచ్చే ఫిర్యాదు దారులపట్ల మర్యాదగా వ్యవహరించాలని కమిషనర్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ద్వారకా ఏసీపీ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ సేవలను వినియోగించుకోవాలి

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ జోన్–3 పరిధిలోని ఆధార్ అప్‌డేట్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జెడ్సీ శివప్రసాద్ వెల్లడించారు. ఈ సేవలు ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. జోన్–3 పరిధిలో 4 సెంటర్‌లోని సచివాలయాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. దొండపర్తిలో 21086143 సచివాలయం, మద్దిలపాలెంలో 21086117 సచివాలయం, పాతరేసవానిపాలెంలో 21086138 సచివాలయంలో, లలితానగర్ 21086125 సచివాలయంలో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆధార్ నవీకరణకు సంబంధించి ఎలాంటి మార్పులైన వినియోగదారులు చేసుకోవచ్చన్నారు. చిన్న చిన్న సమస్యలతో పాటు వేలిముద్రలు, కళ్ల స్కానింగ్ తదితర సేవలు వినియోగించుకోవాలన్నారు. సంక్షేమ పథకాల నమోదు సమయంలో ఆధార్ సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో ఈ సేవలను వినియోగించుకొని ఆయా సమస్యలను పరిష్కరించుకుని పథకాలకు అర్హత సాధించాలని సూచించారు.

రోడ్డుపై వ్యర్థాల తొలగింపు



వ్యర్థాల తొలగింపు తరువాత రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డులోని పిఠాపురం కాలనీ పరిధిలోని రహదారులపై వ్యర్థాలు పేరుకుపోయాయి. ఎక్కడి చెత్త అక్కడే శీర్షికతో మంగళవారం సాక్షిలో ప్రచురించిన కథనానికి జీవీఎంసీ సిబ్బంది స్పందించారు. పిఠాపురం ప్రాంతంలో రోడ్డు మీద ఉన్న వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రూ.10 నాణేల వినియోగంపై అవగాహన మేళా



రూ.10 నాణేలను రైతులకు విక్రయిస్తున్న బ్యాంకు సిబ్బంది

ఎంవీపీకాలనీ: ఆర్బీఐ ఉత్తర్వుల మేరకు రూ.10 నాణేల వియోగంపై బ్యాంక్ ఆఫ్ బరోడా విశాఖ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో అవగాహన మేళాలు నిర్వహించారు. ఎంవీపీ కాలనీ బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ ఆధ్వర్యంలో ఎంవీపీ రైతు బజార్, ఆశీల్‌మెట్ట, డాబాగార్డెన్స్ శాఖల ఆధ్వర్యంలో నరసింహనగర్ రైతు బజార్‌లలో మంగళవారం ఈ మేళాలు జరిగాయి. ఎంవీపీ కాలనీ రైతు బజార్‌లో జరిగిన మేళాలో బ్యాంక్ రీజినల్ మేనేజర్ పీఎం పఠాన్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ సతీష్ సాలుంబు పాల్గొని రూ.10 నాణేల చలామణిపై వినియోగదారులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. రూ.10 నాణేలు పూర్తిస్థాయిలో వినియోగంలో ఉన్నాయని, వాటి ద్వారా క్రయవిక్రయాలు నిర్వహించడంలో ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దని సూచించారు. రైతు బజార్‌లలో వీటిని విస్తృతంగా వాడకంలోకి తీసుకురావాలని కోరారు. అనంతరం రైతులకు నాణేలను విక్రయించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన ఆయా శాఖల ప్రతినిధులు, రైతు బజార్‌ల అధికారులు పాల్గొన్నారు.

సేవే పరమావధిగా.. ఆపన్నులకు అండగా..

పుష్కర కాలంగా రాచకొండ సేవలు
- కుటుంబ సభ్యుల సహకారంతో నిత్యం సేవా కార్యక్రమాలు



మత్స్యకార బాలికకు రూ.లక్ష అందజేసిన అనంతరం పరామర్శించిన దశరథరామయ్య (ఫైల్)



ఆదివాసీ బాలిక ఉన్నత విద్య బాధ్యత స్వీకరిస్తూ ..

ఏయూ క్యాంపస్: సేవ చేయాలనే ఆలోచన కలగడం, దానిని ఆచరణలో చూపడం ఎంతో హర్షించదగ్గ విషయం. దాదాపు పుష్కర కాలంగా సేవా కార్యక్రమాలను నిర్వహించడం దిన చర్యగా మార్చుకున్నారు లాసన్స్ బే కాలనీకి చెందిన రాచకొండ దశరథ రామయ్య. నిత్యం వార్తాపత్రికల్లో, స్నేహితుల ద్వారా ఆపన్నుల వివరాలు తెలుసుకుని వారికి ఆర్థిక సాయం చేయడం ఒక అలవాటుగా మార్చుకున్నారు. పదవీ విరమణ చేసిన తరువాత విశ్రాంత జీవితాన్ని సేవా మార్గంలో గడుపుతున్నారు.

నగరానికి చెందిన రాచకొండ దశరథ రామయ్య స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో చీఫ్ మేనేజర్‌గా పనిచేసి 2016 పదవీ విరమణ చేశారు. విధినిర్వహణలో భాగంగా సమాజంతో, వ్యక్తులతో కలసి పని చేయడం, సంస్థ తరఫున, వ్యక్తిగతంగా సేవలు చేయడం అలవాటుగా మార్చుకున్నారు. బ్యాంక్ సీఎస్ఆర్ నిధులతో సమాజానికి ఉపయుక్తంగా నిలచే కార్యక్రమాలను ఆయన విజయంతంగా నిర్వహించారు. ఎస్‌బీఐ నిధులతో ఒక పాఠశాలను నిర్మించారు, ఆ పాఠశాలను ఆయనే ప్రారంభించారు.

నాటి నుంచి నేటి వరకు దాదాపు 12 ఏళ్లకు పైగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో అనేక సేవా కార్యక్రమాలను ఆయన నిర్వహిస్తున్నారు. ప్రధానంగా విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, దుస్తులు, స్టడీ మెటీరియల్ అందించడం, అత్యవసర వైద్యం అవసరమైన వారికి చికిత్సకు నిధులు అందించడం, క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారికి క్రీడా దుస్తులు, మెడల్స్ అందిస్తున్నారు. ఇటీవల తీవ్ర అనారోగ్యం గురైన నిరుపేద మత్స్యకార బాలికకు రూ.1.11 లక్షలు విరాళం అందించారు. తాజాగా మన్యం జిల్లాకు చెందిన కె.లలితను ఏయూ నృత్య విభాగంలో చేర్చి రెండేళ్ల విద్య, వసతికి సంబంధించిన పూర్తి బాధ్యతలను స్వీకరించారు.

శర్మదాయిని దాతృత్వ సంఘం అధ్యక్షుడిగా, మనో బంధు సంస్థకు ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మానసిక రోగులకు చికిత్స, సహకారం అందించే సంస్థల్లో నిలుస్తూ తనవంతు సహాయసహకారాలను అందిస్తున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన శిక్ష సప్తాహ్‌లో కేడీపీఎం పాఠశాల విద్యార్థులకు పోషకాహారం, నౌకానగర్ పాఠశాలలో చిన్నారులకు పుస్తకాలు ఇతర వస్తువులను, పారిశుధ్య సిబ్బందికి నిత్యావసర సరుకులు, అన్నదానాలకు విరాళాలు, పేదల దహన సంస్కారాలకు నిధులను విరివిగా అందించారు. చేసే ప్రతీ సేవా కార్యక్రమం వెనుక భార్య చందన దేవి సహకారం, కుమారులు బ్రహ్మలింగ రవికుమార్, రామచంద్ర రావు, కుమార్తెలు అన్నపూర్ణ, శ్రావణిల సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. వారు సైతం స్వయంగా నిధులను సమకూరుస్తూ తండ్రి చేసే సేవా కార్యక్రమాలకు వెన్నంటి నిలుస్తున్నారు. రాచకొండ చారిటీస్ పేరుతో ఈ సేవ కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు.

నర్సుల అసోసియేషన్ ఎన్నికలకు విస్తృత ప్రచారం



ధాతి ఆస్పత్రిలో ప్రచారం నిర్వహిస్తున్న ఉషారాణి తదితరులు

ఎంవీపీకాలనీ: నర్సుల అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా యూనిట్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో భాగంగా బి.ఉషారాణి అధ్యక్ష ప్యానల్ సభ్యులు మంగళవారం 18, 19, 20 వార్డుల్లోని పలు ఆరోగ్య కేంద్రాలు, స్థానిక ధాతి ఆస్పత్రి, రాణి చంద్రమదేవి ఆస్పత్రి, విమ్స్ ఆస్పత్రులలో విస్తృత ప్రచారం నిర్వహించారు. సీరియల్ నంబర్ 2తో పోటీలో ఉన్న తనకు ఓటు వేసి గెలిపించాలని ఉషారాణి కోరారు. నర్సుల సంక్షేమంతో పాటు విధి నిర్వహణలో ఎదురయ్యే ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా కృషిచేస్తానని వెల్లడించారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేజీహెచ్ యూనియన్ బ్యాంకు సమీపంలోని నర్సుల బ్లాక్ రూమ్‌లో సీక్రెట్ బ్యాలెట్ విధానంలో ఈ ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. కేజీహెచ్‌లో సైతం ప్యానల్ తరఫున విస్తృత ప్రచారం నిర్వహించినట్లు ఆమె వెల్లడించారు. ఆమె ప్యానల్‌కు మద్దతుగా అబీబుల్లా ఖాన్ మెమోరియల్ సంఘం ప్రధాన కార్యదర్శి దేవరకొండ మార్కండేయులు, రవీంద్రనాథ్ జైతు ప్రచారంలో పాల్గొన్నారు.

స్వచ్ఛత, పరిశుభ్రతపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐఐపీఈ అధికారులు

ఆరిలోవ: జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి సంతపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ(ఐఐపీఈ) వర్సిటీ అధికారులు మంగళవారం సందర్శించారు. ఈ పాఠశాలలో తరగతి గదులు, విద్యార్థులు పరిశుభ్రత తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పిల్లలతో కలసి మొక్కలు నాటారు. మూడు డస్ట్‌బిన్‌లను పాఠశాల హెచ్‌ఎం సిరికి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులకు అందజేశారు. అనంతరం విద్యార్థులకు స్వచ్ఛత, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో ఫిట్ ఇండియా, స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాలు రెండు పాఠశాలలను ఎంపిక చేసుకొని కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వాటిలో సంతపాలెం పాఠశాల ఒకటన్నారు. పాఠశాలల్లో పిల్లలకు యోగా, శారీరక అభివృద్ధి , పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐఐపీఈ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామ్‌పాల్ ద్వివేది, ప్రొఫెసర్ కె.విజయకుమార్, ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.రామునాయుడు, ఐఐపీఈ స్పోర్ట్స్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేష్, పాఠశాల ఉపాధ్యాయులు విజయభాను తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు కృషి చేద్దాం



అవగాహన కల్పిస్తున్న విద్యార్థిని ఆడమ్

మద్దిలపాలెం : దోమల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని గాంబియా దేశానికి చెందిన సోషల్ వర్క్ విద్యార్థిని ఆడమ్ బి సార్ పిలుపునిచ్చారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంద్ర ప్రసాద్ ఆదేశాల మేరకు గ్రీన్‌క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం మద్దిలపాలెం లోని ఓ ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా , బోద, మెదడు వాపు వ్యాధులను అరికడదామన్నారు. గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి. రత్నం మాట్లాడుతూ దోమల నివారణకు విస్తృతంగా ప్రచారం చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో విద్యా సంస్థ ప్రిన్సిపాల్ సునీత, ఏయూ సోషల్ వర్క్‌సోషల్ వర్క్ విద్యార్థినులు బి. ఉషారాణి, బి. తేజస్విని, బి. చైతన్య, సరస్వతి పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.